పశువుల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

వర్షా కాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. ముఖ్యంగా పశువులకు ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు సాధారణమే. అయినా పాడి రైతులు అప్రమత్తం కాకపోతే చిన్న చిన్న వ్యాధులే తీవ్ర ప్రభావం చూపుతాయి. పెంపకందార్లు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా జీవి ప్రాణానికే ప్రమాదం వాటిల్లవచ్చు. అందేకే పశువైద్యులు పాడిరైతులకు ముందస్తుగానే హెచ్చరిస్తున్నారు.

- పశువులకు వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం అధికం
- ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా జంతువు ప్రాణానికే ప్రమాదం
- అత్యవసర సమయంలో 1962కు ఫోన్ చేస్తే ఇంటి వద్దే వైద్య సేవలు





యలమంచిలి రూరల్: వర్షాకాలంలో పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు పేర్కొంటున్నారు. వ్యాధి సోకినట్లు ఏమాత్రం అనుమానం వచ్చినా సమీపంలోని పశువైద్యశాలను సంప్రదించాల్సిందిగా సూచిస్తున్నారు. ఒకవేళ జీవం పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నా, ఆస్పత్రికి తరలించలేని పరిస్థితి ఉన్నా 1962 నంబరుకు ఫోన్ చేస్తే సంచార పశు ఆరోగ్య సేవా వాహనంతో పశు వైద్యులు వచ్చి అందిస్తున్నారు. పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటే మెరుగైన చికిత్స కోసం దగ్గరలోని పశు వైద్యశాలకు తరలిస్తారు.

గాలికుంటుతో పశువుల్లో నీరసం

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలు వంటి వాటికి సోకుతుంది. వ్యాధి బారిన పడిన పశువుకు 104 నుంచి 105 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత ఉంటుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. దీంతో నీరసించి, నడిచేందుకూ ఇబ్బంది పడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

పీడించే 'జలగ'

మురుగునీరు, కాల్వల్లో అశుభ్రమైన నీరు తాగడం వల్ల జలగ వ్యాధి ప్రబలుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు వస్తుంది. పశువులు మేత మేయడంలో ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి తగ్గుతుంది. జలగ వ్యాధి బారిన పడకుండా పశువులకు డిస్టోడిన్ 4 మాత్రలు, 100 మి.లీ. నీయోజడ ప్లస్‌ను అందించాలి.

నట్టలతో ఎదుగుదలకు బ్రేక్

గొర్రెలు పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో గొర్రె ఎదగడానికి అవకాశం ఉండదు. గొర్రెలు తిన్న ఆహారమంతా నులి పురుగులే తినేయడంతో రోగాల బారిన పడే అవకాశం ఉంది. వర్షాకాలంలో ఎక్కువగా గొర్రెలు ఈ వ్యాధి బారిన పడతాయి. ఎందుకంటే వర్షాలు పడి అక్కడక్కడ పచ్చి మేత పెరుగుతూ ఉంటుంది. అది తిన్నప్పుడు సమస్య ఉత్పన్నమవుతుంది. అందుకే ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలుగా ఆరు నెలకోసారి నట్టల నివారణ మందులు ఉచితంగా వేస్తుంది.



పశువుకు చికిత్స చేస్తున్న సంచార పశు ఆరోగ్య సేవా సిబ్బంది

గొంతువాపు.. ప్రాణాంతకం

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైనది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ, శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు ముఖ్యంగా జూన్, జూలై నెలల్లో(హెచ్ఎస్) టీకాలు వేస్తారు. వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.

వ్యాక్సిన్‌తో 'చిటుకు'లో చెక్

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా సోకే మరో వ్యాధి చిటుకు. ఈ వ్యాధి వచ్చినపుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నివారణ కోసం జూన్, జూలై మాసాల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు పశువులకు సంబంధించి వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందిస్తే వాటిని వ్యాధుల నుంచి సంరక్షించుకోవచ్చు.

సకాలంలో చికిత్స చేయించాలి



పశువులు, గొర్రెలు, మేకల్లో అనారోగ్యాన్ని గుర్తిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. ఏదైనా వ్యాక్సిన్ వేయిస్తే దాని ప్రభావం ఆరు నెలల వరకు ఉంటుంది. నట్టల నివారణ మందులను ఆరు నెలలకోసారి వేస్తాం. గొంతువాపు, చిటుకు వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో 1962కు కాల్ చేస్తే సిబ్బంది వచ్చి వైద్య సేవలు అందిస్తారు. సాధ్యమైనంతవరకు జీవాల ప్రాణాలను నిలబెట్టేందుకు వైద్యులు శ్రమిస్తారు. ఎలాంటి సందేహాలున్నా రైతులు పశు వైద్య కేంద్రాల్లో పశు వైద్యులను సంప్రదించవచ్చు.

– డాక్టర్ బి.సౌజన్య, ఏడీ, పశు సంవర్ధక శాఖ, అనకాపల్లి

క్లుప్తంగా

పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభం



కోటవురట్ల హైస్కూల్లో పాఠ్యపుస్తకాలతో విద్యార్థులు

కోటవురట్ల: ఆరంభం నుంచి పట్టుదలగా చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు ఎంఈవోలు రామారావు, శ్రీజోషి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠ్యపుస్తకాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధనలో నూతన ఒరవడిని సృష్టించాలన్నారు. సులభరీతిలో బోధన చేసి మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. మారిన సిలబస్‌ను అనుసరించి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.లక్ష్మి, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, కృష్ణ, చంద్రశేఖర్, రాజీవ్, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సరకుల పంపిణీ



అంగన్‌వాడీ సరకులను అందిస్తున్న జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పరశురామ్

మునగపాక: పోషక విలువలతో కూడిన ఆహారం బాలింతలు, గర్భిణులకు శ్రేయస్కరమని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ అన్నారు. మునగపాకలోని పల్లపు వీధి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవల్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూరిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కశింకోట బాలికల హైస్కూల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యాస రచన పోటీలు

కశింకోట: పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని స్థానిక బాలికల హైస్కూల్ హెచ్ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి సూచించారు. కశింకోటలోని బాలికల హైస్కూల్లో శుక్రవారం ఎకో సంస్థ తరఫున పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్య నివారణకు అందరూ మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టారు. పీడీ పెంటకోట కమల, ఉపాధ్యాయులు డి.కాళిదాస్, పద్మ, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి నాంది

నక్కపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐదు సంతకాలతో చంద్రబాబునాయుడు అభివృద్ధికి నాంది పలికారని మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మెగా డీఎస్సీతో పాటు, రూ.4 వేల పెన్షన్, స్కిల్ డెవలప్‌మెంట్ గణన తదితర నాలుగు అంశాలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. టీడీపీతో పాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మద్దతు వల్లే తాజా సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. చంద్రబాబు సీఎం అయ్యారంటే పవన్‌కల్యాణ్ కృషి ఎంతో ఉందన్నారు. అభివృద్ధే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ తమ ప్రభుత్వం నెరవేర్చి తీరుతుందన్నారు. ప్రజలు తమకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగుతుందన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో పెంకుల రాజు, మీగడ సత్తిబాబు, కేవీ, కక్కిరాల సురేష్, అల్లాడ రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు



గణపర్తి హైస్కూల్లో విద్యార్థి కిట్లను పంపిణీ చేస్తున్న హెచ్ఎం జయలక్ష్మి

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని ఎంఈవో వేణుగోపాలరావు సూచించారు. శుక్రవారం మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు విద్యార్థి కిట్ల పంపిణీ ప్రారంభమయింది. కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువులపై దృష్టి సారించాలన్నారు. గణపర్తి హైస్కూల్లో హెచ్ఎం జయలక్ష్మి విద్యార్థులకు విద్యార్థి కిట్లను అందించారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కశింకోట: మండలంలోని తేగాడ వద్ద ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్)లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఐ.మార్తాతిలకం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ స్కూల్లో 7, 8, 9 తరగతుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. వీటికి ఈ నెల 20లోగా ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాత పరీక్ష ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తమ పాఠశాలలో అన్ని రకాల వసతులతో అత్యుత్తమ విద్యా బోధన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రయోజనాలన్నీ విద్యార్థులకు అందిస్తామన్నారు.

ఈదురు గాలులతో వర్షం

నేలకొరిగిన చెట్లు.. నిలిచిన విద్యుత్ సరఫరా



పట్టణంలో కురుస్తున్న వర్షం



గాలులకు ఊగుతున్న చెట్లు



ఈదురు గాలుల బీభత్సం

యలమంచిలి రూరల్: ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో శుక్రవారం సాయంత్రం యలమంచిలి పట్టణంలో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. కొన్ని చోట్ల విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పట్టణంలోని పలు వీధుల్లో అంధకారం అలముకుంది. శుక్రవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. తొలకరి సాగు పనులు చేసుకుంటున్న రైతాంగానికి ఈ వర్షం మేలు చేస్తుందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు.

మెరుపులు, ఈదురు గాలులు

రాంబిల్లి: మండలంలో శుక్రవారం భిన్న వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం వరకు మండు వేసవిని తలిపిస్తూ ఎండ, వడగాడ్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారింది. ఆకాశం మేఘావృతమైంది. ఈదురు గాలులతో కూడిన తేలికపాటి చినుకులు తప్ప ఆశించిన వర్షం పడలేదు. గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఘనంగా వీరాంజనేయ ఆలయ వార్షికోత్సవం

మునగపాక: మండలంలోని గణపర్తిలో శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తులు వీరాంజనేయ స్వామిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బాలాజీ నగర్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

గ్రామాల్లో ఇంటింటా ధర్మ ప్రచారం

అచ్యుతాపురం: మండలంలోని తంతడి, గండివానిపాలెం గ్రామాల్లో శుక్రవారం సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ యలమంచిలి ఖండ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు మాట్లాడుతూ ఇంట్లోనే కులం అని, బయట మనమంతా హిందూవులమే అంటూ వ్యాఖ్యానించారు. తోటి వారిని ఆదరించాలని, గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో చోడపల్లి సత్యం, ఆత్మకూరి వెంకటరావు, గండి రాజు, చెల్లిబోయిన దేవుడు, ముమ్మిడి గంగమ్మ, చోడపల్లి ధనలక్ష్మి, లోక్‌నాథ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: పట్టణానికి నీటి సరఫరా అందించే సోముదేవపల్లి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో శనివారం ఉదయం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు మున్సిపల్ డీఈఈ వీరయ్య మీడియాకు తెలిపారు. 4 నుంచి 19 వార్డులతో పాటు 25వ వార్డుకు కూడా శనివారం నీటి సరఫరా ఉండబోదన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ట్యాంకర్ల ద్వారా ఆయా ప్రాంతాలకు నీటిని అందిస్తామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాల్సిందిగా కోరారు.

నారు మడుల దుక్కి పనుల్లో రైతులు



దుక్కి పనులు చేస్తున్న రైతు

రాంబిల్లి: నారుమడుల తయారీ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అడపా దడపా వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు ఖరీఫ్ పనులు చేసుకుంటున్నారు. ఈ ఏడాది సుమారు 8 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. సాగు కోసం రైతులు నారుమడుల దుక్కి పనుల్లో బిజీ అయ్యారు. ట్రాక్టర్ల సాయంతో దుక్కి పనులు చురుగ్గా చేపడుతున్నారు. మరోపక్క ప్రభుత్వం రాయితీపై అందించిన పచ్చిరొట్ట విత్తనాలను వేసేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. వరినాట్లు వేసే ముందు పచ్చిరొట్టను దమ్ము చేస్తారు. ఇలా చేయడం ద్వారా పొలానికి సేంద్రియ ఎరువు అందించినట్లవుందని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు.

రక్తదానంతో ప్రాణదానం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం: రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణ దానం చేసినట్లేనని సర్వసిద్ధి ఇన్‌చార్జ్ వైద్యాధికారి సీహెచ్ దీపిక అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కనీసం 50 కిలోల బరువుండి, 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్కులైన ఆరోగ్యవంతులెవరైనా రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం ద్వారా సేకరించిన రక్తాన్ని బ్లడ్ బ్యాంకుల్లో నిల్వ చేసి, అత్యవసర సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ఎక్కిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఎఫ్ క్లస్టర్ పర్యవేక్షకులు పీఎస్‌వీఎస్ ప్రసాద్, కార్యదర్శి కె విజయ్, బేబి, ఆశ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి పథకంతో కాలువలు, చెరువుల అభివృద్ధి



కాలువ పనుల్ని పరిశీలిస్తున్న తోటాడ సర్పంచ్ భర్త కోటేశ్వరరావు

మునగపాక: ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలు, చెరువులు, రహదారుల అభివృద్ధి జరుగుతోందని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు అన్నారు. తోటాడ నుంచి అనకాపల్లికి వెళ్లే మార్గంలో కాలువల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, స్థానికంగా అవసరమైన అభివృద్ధి పనుల్ని చేపట్టాలని సూచించారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు కాలువలను ఆనుకుని పేరుకుపోతున్న తుప్పలతో పడుతున్న ఇబ్బందులు తాజా పను ల ద్వారా తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో పలువురు కూలీలు పాల్గొన్నారు.

పి.ధర్మవరంలో ఫ్రైడే డ్రైడే



పి.ధర్మవరంలో ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం: ఇంటి పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందే అవకాశాలపై కుటుంబ సభ్యులు అవగాహన కలిగి ఉండాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జయమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ ఆదినారాయణ తెలిపారు. పెనుగొల్లు ఆరోగ్య కేంద్రం పరిధి పి.ధర్మవరం గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఇళ్లలో నిల్వ నీరు ఉండే వివిధ రకాల పాత్రలు, వస్తువుల్లో దోమలు లార్వాను ఎలా వృద్ధి చేస్తాయో వివరించారు. ఎయిర్ కూలర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ వాటర్ బాటిళ్లు తదితర వాటిల్లో నీరు రోజుల తరబడి నిలిచి, దోమల వ్యాప్తికి కారకాలు మారతాయన్నారు. దోమల ద్వారా వచ్చే రోగాలు, ఇబ్బందుల్ని వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది ఎంఎల్ పీహెచ్‌సీ ప్రమీలాకుమారి, హెల్త్ సెక్రటరీ దాలియమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్గానిక్ కూరగాయలతో ఆరోగ్యం

తుమ్మపాల: ప్రకృతి వ్యవసాయంలో ఘన జీవామృతం వల్ల భూమికి మంచి పోషకాలు అందుతాయని, పంటల దిగుబడికి రసాయన ఎరువులు వాడనవసరం లేదని ప్రకృతి వ్యవసాయం మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ శిరసపల్లి అప్పలరాజు అన్నారు. మండలంలోని వెంకుపాలెం గ్రామంలో రైతులతో కలిసి శుక్రవారం వెయ్యి కిలోల ఘన జీవామృతం తయారు చేశారు. ఇది ఆరు నెలల పాటు నిల్వ ఉంటుందని, దమ్ములో పైభాగంగా దీన్ని వాడుకోవచ్చన్నారు. పకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యం, బెల్లం, పత్తి వంటి ఉత్పత్తులను ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మార్కెటింగ్ స్టాల్ ద్వారా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రసాయన కూరగాయల కన్నా ఆర్గానిక్ ఉత్పత్తుల ద్వారా ఆరోగ్యం బాగుంటుందన్నారు. మార్కెట్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులను పది శాతం ఎక్కువ రేటుతో రైతులు అమ్ముకోవచ్చన్నారు. ఈ రకమైన వ్యవసాయ ఉత్పత్తులతో రైతులు లాభాలతోపాటు, ప్రజలకు ఆరోగ్యకర జీవనం సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆర్గానిక్ సాగు రైతులు మజ్జి సత్యారావు, మువ్వల అప్పారావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీఐ ద్వారా వినియోగదారుల హక్కుల పరిరక్షణ



లయన్స్ క్లబ్ తరఫున పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న కాంద్రేగుల వెంకటరమణ

కశింకోట: ఆర్టీఐ చట్టంతో వినియోగదారుల హక్కులను పరిరక్షించుకోవచ్చని ఆర్టీఐ రిసోర్స్‌పర్సన్ కాంద్రేగుల వెంకటరమణ అన్నారు. అనకాపల్లిలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం చేబోలు రామ్మూర్తి మెమోరియల్ లయన్స్ సర్వీస్ సెంటర్ హాలులో ఆర్టీఐ చట్టం-వినియోగంపై జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రశ్నించిన తత్వం పెరిగే కొద్దీ ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం మెరుగు పడుతుందన్నారు. ప్రభుత్వ రికార్డులను పరిశీలించే హక్కు ప్రతి పౌరునికి ఉందన్నారు. ఈ సందర్భంగా పేద విద్యార్థికి క్లబ్ తరఫున ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వి.వెంకటరాజు, కార్యదర్శి బి.అప్పలరాజు, సభ్యులు దారా జగన్నాథరావు, ఎన్.ఎస్.ప్రకాష్‌గుప్త, పూసర్ల సుధీర్, బి.పద్మరాజు పాల్గొన్నారు.

ఎకో క్లబ్ కార్యక్రమంలో పాఠశాల పరిశుభ్రం



కోటవురట్ల హైస్కూల్లో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎకో క్లబ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు శుక్రవారం పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేసే పని చేపట్టారు. హెచ్ఎం మడ్డు లక్ష్మి ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలు తొలగించి, చెత్తను ఏరివేశారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 13 నుంచి 16 వరకు పాఠశాలలో ఎకో క్లబ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నారాయణరెడ్డి, రత్నం, కల్యాణం, కృష్ణ, బాబు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్య సంరక్షణ

కశింకోట: విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండటానికి పోషకాహారం తీసుకోవాలని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యు.రమేష్ సూచించారు. తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. సురక్షితమైన నీటిని తాగాలన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వస్తాయని, దోమలు కుట్టకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.గ్రేస్, ఆరోగ్య బోధకులు ఎంఎస్‌వీ ప్రసాద్‌లు విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. చేతుల ద్వారానే ఎక్కువగా రోగాలు ప్రబలుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వైఏ సుబ్బారావు, ఆరోగ్య పర్యవేక్షకుడు కేఎస్ఆర్‌కేజీ నరసింహారావు, ఏఎన్ఎం అన్నమ్మ, ఆరోగ్య కార్యకర్త ఆర్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.